సాక్షి సూర్యాపేట

బుధవారం ၊ 11 ၊ డిసెంబర్ ၊ 2024



కిలోన్నర గంజాయి పట్టివేత

గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. - 10లో



ప్రగతిలో భాగస్వాములు కావాలి

పౌరులు దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. - 10లో



పశువుల దాణాగా బాలామృతం

యాదాద్రి జిల్లాలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతాన్ని పిల్లలకు పెట్టకుండా పశువుల దాణాగా విక్రయిస్తున్నారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు నల్లగొండలో బహిరంగ విచారణ

భానుపురి (సూర్యాపేట) : ఎస్సీ వర్గీకరణ పై అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ నల్లగొండ కలెక్టరేట్‌లో బుధవారం బహిరంగ విచారణ చేయనున్నట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే ఈ విచారణలో ఎస్సీ సంఘాల నాయకుల నుంచి జస్టిస్ షమీమ్ అఖ్తర్ వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ కులాల వారు అధికసంఖ్యలో హాజరై వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు.

హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేయాలని వినతి



డీఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సూర్యాపేటటౌన్ : గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి కోరారు. గురుకులాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలంకు పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో కొన్ని రోజులుగా ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. డీఎంహెచ్‌ఓ స్పందించి వైద్యశిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెడికల్ కిట్లు కూడా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిడమర్తి భరత్, వీరబోయిన లింగయ్య, దూదిపాల ప్రవీణ్, మహేష్, వినయ్, నవీన్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రణాళిక



నూతనకల్ పీహెచ్‌సీలో సమావేశమైన కేంద్ర, రాష్ట్ర వైద్య అధికారుల బృందం సభ్యులు

నూతనకల్ : కుష్టు వ్యాధి నిర్మూలనకు పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని కేంద్ర, రాష్ట్ర వైద్య అధికారుల బృందం సభ్యులు సూచించారు. మంగళవారం నూతనకల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. కుష్టు వ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించి వారు వైద్య సేవలు పొందేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం గ్రామంలో కుష్టు వ్యాధిపై నిర్వహించిన సర్వే, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర వైద్య అధికారులు డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ జాన్‌బాబు, బాలకృష్ణ, మండల వైద్యాధికారి అక్షితారెడ్డి, డీపీఎంఓ థామస్, సీహెచ్‌ఓ శరబ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్లను అరెస్టు చేయడం అమానుషం



మాట్లాడుతున్న ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురూజీ

సూర్యాపేట: వేతనాలు పెంచాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టిన ఆశ వర్కర్లను పోలీసులు అరెస్టు చేయడం అమానుషమని ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంపటి గురూజీ పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లా కేంద్రంలో పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. దీంతో వారు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గౌరీదేవి, సక్కుబాయి, బైనాభాయ్, ఉమా, సునిత, మణెమ్మ, సైదమ్మ, సునిత, మరియమ్మ, విజయలక్ష్మి, నిర్మల, స్వర్ణలత, సరిత, నాగలక్ష్మి, జయమ్మ, వసంత పాల్గొన్నారు.

విగ్రహం మార్పు దురదృష్టకరం



సూర్యాపేట పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : తెలంగాణ తల్లి విగ్రహం మార్పు చేయడం ప్రభుత్వ దుశ్చర్య, దురదృష్టకరమని మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహం రూపాన్ని మార్పు చేసి ఆవిష్కరించడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లింగయ్యయాదవ్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ పాలనలో పదేళ్లు సబ్బండ వర్గాలకు ఫలాలు అందిస్తే నేడు సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఔన్నత్యాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నాడు ఎంతో మంది కవులు, కళాకారులు, తెలంగాణ వాదులు ఆలోచించి తెలంగాణ తల్లి దేవతలా ఉండాలని ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని దేవతలా పూజించడాన్ని ఓర్వలేని రేవంత్ రెడ్డి నేడు కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తెలంగాణ సమాజాన్ని అగౌరవ పర్చడమేనన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక రాజీవ్ గాంధీ విగ్రహాన్ని, కాంగ్రెస్ తల్లి విగ్రహాలను గాంధీభవన్‌కు గౌరవంగా పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నాయకులు వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, ఆకుల లవకుశ, బూర బాలసైదులుగౌడ్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేసింది ఒక్కటీ లేదు

ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం

- వారు చెప్పుకోవడానికి ఒక్క కొత్తపనైనా ఉందా
- అన్నీ మేము మంజూరు చేసినవి, పూర్తి చేసినవే..
- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ 95 శాతం పనులను పూర్తి చేశాం
- బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌లో ముందుగా మేము నీళ్లు పోయించింది వాస్తవం కాదా
- కొత్తవి తేలేకపోయినా.. ఉన్నవి నిలబెట్టుకునే పరిస్థితి కూడా లేదు

'సాక్షి' ఇంటర్వ్యూలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

'కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వారు చేసిన అభివృద్ధి ఒక్కటంటే ఒక్కటి లేదు. ఇది చేశామని చెప్పుకోవడానికి ఏమీ లేదు. నేననడమే కాదు చూస్తుంటే తెలుస్తోంది కదా. వారు ప్రారంభోత్సవాలు చేసినవి అన్నీ మేము చేసినవే.. పైగా అభివృద్ధికి అడగడుగునా అడ్డు పడుతున్నారు.. మంజూరు చేసిన పనులను రద్దు చేస్తున్నారు..' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా గతంలో పరిస్థితులు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

– సాక్షి ప్రతినిధి, నల్లగొండ



బ్రాహ్మణవెల్లెంలలో నీళ్లు పోయించిందెవరు?

బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌లో ముందుగా నీళ్లు పోయించింది ఎవరు? ఆ పనులను పూర్తి చేసిందెవరు? మేం నీళ్లు పోయించింది వాస్తవం కాదా? కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏముంది. వాస్తవాలు ప్రజలకు తెలుసు. నిజంగా చేస్తే ఈ ఏడాది కాలంలో కొత్తగా ఏం చేశారో చెప్పండి. బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌లోకి మేము నీళ్లు పోయించినట్లు రికార్డులు ఉన్నాయి. పరిశీలిస్తే తెలుస్తుంది.

ఒక్క పవర్ ప్లాంట్ విషయంలోనే సోయి

మేం కట్టిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్దేవద్దన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రద్దు చేస్తామన్నారు. ప్రజా పాలన విజయోత్సవం అంటూ ఇప్పుడు గొప్పగా ప్రారంభోత్సవం చేశారు. సంతోషమే. ప్రకటన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పవర్ ప్లాంట్‌ను కూల్చుతారేమోనని అనుకున్నా. కానీ ఈ ఒక్క విషయంలోనైనా కనీసం సోయితో వ్యవహరించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ 95 శాతం పనులను మేమే పూర్తి చేశాం. కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో ప్రారంభించారు.

డబ్బులు, వసూళ్ల పైనేశ్రద్ధ

నల్లగొండ జిల్లా మంత్రి పొద్దంతా కూడా స్పృహ లేని మాటలే మాట్లాడుతున్నారు. ప్రజలకు కావాల్సింది ఇవి కాదు కదా. వారి జీవితాల్లో వెలుగు కావాలి. ఏదైనా మార్పు రావాలి. ఇది చేశామని మంత్రి ఏదైనా ఒక్కటి చెప్పగలా? ఇవి అడుగతారనే భయానికి బూతు మాటలు, బూతు చేష్టలతో వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నామన్న సోయి లేదు. కేవలం డబ్బులు సంపాదించుకునే టప్పుడు, వారిని, వీరిని భయ పెట్టి వసూలు చేసుకునేటప్పుడు మాత్రమే ఆ శ్రద్ధ కనిపిస్తోంది. జిల్లా అభివృద్ధిపై ఆలోచనలే లేదు. ఆ వైపు దృష్టే లేదు. సంవత్సర కాలంలో వారికి సంతృప్తిని ఇచ్చిన కొత్త పని ఏంటో చెప్పాలి.

తెచ్చినవి పోగొట్టారు.. ఇచ్చినవి రద్దు చేశారు

సూర్యాపేట నియోజకవర్గంలో నేను తెచ్చినవన్నీ పోయాయి. అన్నీ వారే పోగొట్టారు. జిల్లాకు కేసీఆర్ వచ్చినప్పుడు సూర్యాపేటలో అదనంగా స్పోర్ట్స్ స్కూల్ ప్రకటించాం. దానికి అనుగుణంగా నిధులను కేటాయించాం. యువతకు ఉపయోగపడే దానిని పోగొట్టారు. పాలిటెక్నిక్ కళాశాలకు కొత్త క్యాంపస్ భవనం ప్రకటించాం. నిధులను కేటాయించాం. ఆ నిధులు వెనక్కి పోయేలా చేశారు. సూర్యాపేట పట్టణంలో రోడ్లకు రూ. 50 కోట్లు కేటాయించా. జనగామ నుంచి ఖమ్మంరోడ్డును కలుపుతూ వయా కలెక్టరేట్ మీదుగా 100 ఫీట్ల రోడ్డును మంజూరు చేశా. అది పోగొట్టారు. పుల్లారెడ్డి చెరువును మినీ ట్యాంక్ బండ్ చేస్తూ అభివృద్ధి పనులను ప్రారంభించా. అది ఓ దశకు వచ్చింది. ఈ తరుణంలో ఆ నిధులను ఆపేశారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. నల్లచెరువు చుట్టూ నెక్లెస్ రోడ్డు చేయడానికి చర్యలు చేపట్టా. దీనిని ఆపేశారు. సూర్యాపేటకు దాదాపు రూ. 250 కోట్లతో అభివృద్ధి పనులకు ప్లాన్ చేశాం. రూ. 100 కోట్ల పనులకు ప్రకటన చేశాం. పాలనా పరమైన అనుమతులు తెచ్చాం. నిధులు మంజూరు చేశాం. వాటన్నింటినీ రద్దు చేశారు.

ఏదైనా కొత్త పథకం తెచ్చారా?

జిల్లాలో ఈ సంవత్సర కాలంలో ఇద్దరు మంత్రులు ఏం చేశారు? ఏదైనా కొత్త పథకం తెచ్చారా? వారికో ఆలోచన అంటూ ఉంటే కదా. అంతా చెత్త వాగుడు. రోత మాటలు తప్ప ఒకటంటే ఒకటీ లేదు. అన్ని రకాలుగా ఫెయిల్ అయ్యారు. ఇంత దారుణంగా ఫెయిల్ అయిన ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే అభివృద్ధి పట్ల సోయి లేదు. చిత్త శుద్ధి లేదు. జిల్లా అభివృద్ధిపై ధ్యాస లేదు. కనీసం వారి పేరు నిలబెట్టుకోవడానికైనా ఒక్కటన్నా చేశారా?

అన్నీ తిరోగమనమే.. విజన్ లేని ప్రభుత్వం



ఇప్పుడు వారు వచ్చే వాటిని పోగొట్టే పనిలో ఉన్నారు. కొత్తవి తేలేకపోయినా ఉన్నవి నిలబెట్టుకునే పరిస్థితి లేదు. ఆ ఆలోచన ఉన్నట్లు కూడా కనిపించడం లేదు. ప్రజలు ఇచ్చిన హామీలపై నిలదీస్తారనే భయమో ఏమోగానీ ప్రభుత్వమే కొత్త కొత్త సమస్యలను తనకు తానే సృష్టించుకుంటోంది. విచిత్రమైన ప్రభుత్వం. చరిత్రలో ఎప్పుడూ లేనిది. మొదటి ఆరునెలల కాలంలోనే ఆరేడు వేల కోట్ల రూపాయల ఆదాయం తగ్గిందని వారే ప్రకటించారు. వారి అపరిపక్వత, అజ్ఞానానికి ఇదే నిదర్శనం. అధికారాన్ని వ్యక్తిగత స్వార్థానికి వాడుకుంటున్నారు. అంతా చెత్త వాగుడు. రోత మాటలు తప్ప మరేం లేదు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను నాశనం చేశారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం తగ్గిపోతోంది. వారి సొంత ఆదాయం పెరుగుతోంది. నిధుల సమస్యలతో చేయలేకపోయినవి కొన్ని ఉంటాయి. కానీ ప్రభుత్వం ఒక్కటీ చేయలేకపోయింది. మేం ఇచ్చిన విద్యుత్‌ను సరిగ్గా ఇవ్వలేకపోతున్నారు. మంచినీటిని పూర్తిగా ఇవ్వలేకపోతున్నారు. మేం బాగా నడిపిన రెసిడెన్షియల్ పాఠశాలలను సరిగ్గా నడుపలేకపోతున్నారు. పైగా కొత్త సమస్యలు సృష్టించి అభివృద్ధి నిరోధకులుగా మారుతున్నారు.

'మహిళాశక్తి' గ్రౌండింగ్ పూర్తిచేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో మహిళాశక్తి పథకం యూనిట్లు గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి జిల్లాలోని ఎంపీడీఓలు, ఎంపీఓలు, డీపీఎంలు, ఏపీఎంలు, ఏపీఓలు, ఈసీఎస్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనిట్ల గ్రౌండింగ్‌లో జాప్యం లేకుండా 10 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని కోరారు. తడి, పొడి చెత్తలను సక్రమంగా సేకరించి కంపోస్టు ఎరువు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా మార్చి 2025 నాటికి ఆరు కేటగిరీలకు చెందిన 21 రకాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా వివరాల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అన్ని గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను మరోసారి తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ అడిషనల్ సీఈఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయడం అవసరం

డ్రగ్స్ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయడం అవసరమని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన నషా ముక్త భారత్ అభియాన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి స్కూల్, కాలేజీలో యాంటీ డ్రగ్ కమిటీలు వేయాలన్నారు. సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎఫ్‌ఓ సతీష్, డీపీఓ నారాయణరెడ్డి, ఆర్డీఓలు వేణు మాధవ్ రావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, లక్ష్మానాయక్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీఈఓ అశోక్ పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు

ముసాయిదా ఓటర్ల జాబితా తప్పులు లేకుండా, డబుల్ ఎంట్రీ లేకుండా చూడాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు , డీపీఓ నారాయణరెడ్డి, డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, ఎలక్షన్ సూపరింటెండెంట్స్ శ్రీనివాసరాజు, వేణు, రాజేశ్వరరావు, సత్యనారాయణ, ఎం.డీ.ఆబిద్, కోట గోపి, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో అదనపు కలెక్టర్, అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పని సరి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

చివ్వెంల (సూర్యాపేట) : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పని సరి అనిసూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి సూచించారు. మంగళవారం జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఆటో యూనియన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆటో డ్రైవర్లు పబ్లిక్ పోలీసింగ్ చేయాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. వాహన కాగితాలు లేకుండా బండి నడపడం, మాదక ద్రవ్యాలు రవాణా చేయడం చట్టరీత్యా నేరం అని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపకూడదన్నారు. అనుమానిత వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దపుకు మల్లయ్య, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, సీఐ రాఘవులు, ఎస్‌ఐ సాయిరాం, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవం చేపట్టారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, నవీన్‌కుమార్, రామాచార్యులు, పద్మనాభా చార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణి భూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

సర్వ శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

భానుపురి : సమగ్ర శిక్షా పథకంలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన సమ్మె పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే డిమాండ్లను నెరవేరుస్తామని ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ప్రకటించారని తెలిపారు. ఈ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు రాంబాబు నాయక్, కోశాధికారి లక్ష్మీనారాయణ, కార్యదర్శి సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సొంతింటి కల సాకారంపై ఆశలు

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం
- మొబైల్ యాప్‌లో దరఖాస్తుదారుల వివరాల నమోదుకు ప్రణాళిక
- నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తి చేయడానికి కసరత్తు
- జిల్లాలో 3.09 లక్షల మంది దరఖాస్తుదారులు

భానుపురి (సూర్యాపేట) : నిరుపేదలకు సొంతిల్లు సాకారంపై ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం దరఖాస్తుదారుల వివరాల సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ప్రారంభించిన 'ఇందిరమ్మ ఇండ్లు' యాప్‌ను పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్‌లో దరఖాస్తుల పూర్తి సమాచారం నమోదు చేసేందుకుగాను ఇంటింటికి వెళ్లాల్సి ఉంది. ఈ ప్రక్రియ సోమవారం నుంచే ప్రారంభించాల్సి ఉన్నా.. ఇంకా పూర్తిస్థాయిలో మొదలు కాలేదని తెలుస్తోంది.



జిల్లాలో 3,09,068 మంది దరఖాస్తు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలో దాదాపు 3,09,068 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గ్రామీణ ప్రాంతంలో 2,50,684 మంది, అర్బన్ ప్రాంతంలో 58,378 మంది ఉన్నారు. ఈ పథకం కింద పూర్తి రాయితీతో రూ.5 లక్షలు మంజూరు చేయనుంది. నిర్మాణ దశలను బట్టి బిల్లు విడుదల చేస్తారు. ప్రతీఅసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3,500 ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. వివరాల సేకరణ అనంతరం ఇళ్లు మంజూరు చేస్తారు.

ఆదిలోనే ఆలస్యం..

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల పూర్తి వివరాల సేకరణ సోమవారం నుంచే ప్రారంభించాల్సి ఉన్నా.. పంచాయతీ కార్యదర్శులు సుముఖంగా లేక మొదలు కాలేదని తెలుస్తోంది. ఇప్పటికే సమగ్ర సర్వేలో ఇంటింటికి తిరగడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో ఇబ్బంది పడ్డామని వాపోతున్నారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు యాప్‌లో లాగిన్ అయ్యారు. కానీ వివరాల నమోదు ఎక్కడా ప్రారంభం కాలేదని తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ప్రక్రియ మొదలు కానుంది.

వివరాల సేకరణ ఇలా..

దరఖాస్తుదారుల వివరాలను గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు లేని గ్రామాల్లో ఐకేపీ సీసీలు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు నమోదు చేయాల్సి ఉంది. యాప్‌లో ఉన్న దరఖాస్తుదారుని ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ఫొటోను తీయనున్నారు. ఇంటి లోపలి భాగం, పైభాగం ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దరఖాస్తుదారు ఇంటి నిర్మాణానికి స్థలం ఉంటే ఫొటో సేకరిస్తారు. అందుకు సంబంధించిన పత్రం (డాక్యుమెంట్) ఫొటో తీస్తారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధిపొందారా అనే వివరాలు ఆరా తీయనున్నారు.

క్లుప్తంగా

ఇస్త్రీ దుకాణం దగ్ధం



దుకాణంలో చెలరేగుతున్న మంటలు

యాదగిరిగుట్ట: పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్బీ కాంప్లెక్స్‌లో గొరారం భిక్షపతికి చెందిన ఇస్త్రీ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో దుకాణంలో ఉన్న దుస్తులు, ఫర్నీచర్ దగ్ధయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున ఇస్త్రీ దుకాణంలో మంటలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు భిక్షపతికి సమాచారం ఇచ్చారు. ఆయన దుకాణం వద్దకు వచ్చేసరికే అందులో ఉన్న ఇస్త్రీ పెట్టెలు, దుస్తులు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు అప్రమత్తం కావడంతో పక్కన ఉన్న మడిగెలకు మంటలు వ్యాపించలేదు. ఈ ఘటనలో సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని భిక్షపతి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ సెక్రటరీ జనరల్ బాపట్ల నరహరి ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిక్షపతికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించిన గమన్‌రెడ్డి



బ్లాక్ బెల్ట్ అందుకుంటున్న గమన్‌రెడ్డి

నేరేడుచర్ల : హైదరాబాద్‌లోని అల్కాపుర్ టౌన్ షిప్‌లోని సీట్స్ సంస్థలో సోమవారం జరిగిన జాతీయ తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో నేరేడుచర్లకు చెందిన ఎనిమిదేళ్ల కొణతం గమన్‌రెడ్డి బ్లాక్ బెల్ట్ సాధించాడు. గమన్‌రెడ్డి ఇప్పటి వరకు అండర్–25 కిలోల విభాగంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మొత్తం 7 మెడల్స్ సాధించగా.. అందులో మూడు గోల్డ్, నాలుగు సిల్వర్ మెడల్స్ ఉన్నాయి. అల్కాపుర్ టౌన్‌షిప్‌లోని స్కాలర్స్ అకాడమీలో నాలుగో తరగతి చదువుతున్న గమన్‌రెడ్డి కోచ్ సైకం సుబ్బారావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు. గమన్‌రెడ్డి బ్లాక్‌బెల్ట్ సాధించడంపై తల్లిదండ్రులు ఉదయ్‌కుమార్‌రెడ్డి–శోభన, తాత నేరేడుచర్ల పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణ రెడ్డి–విజయలక్ష్మి దంపతులు అభినందించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మద్దిరాల : మద్యానికి బానిసై ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మద్దిరాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముకుందాపురం గ్రామానికి చెందిన కాసోజు సత్యనారాయణ అనే వ్యక్తి మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించింది. కుటుంబ సభ్యులు గతంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా మద్యం మానకపోగా.. మద్యం మానుకోవాలని వారించిన భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో భార్యతో గొడవపడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని మృతి చెందాడని మృతుడి భార్య వినోద పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎం. వీరన్న తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పశువుల దాణాగా బాలామృతం!

భువనగిరిలోని పశువుల పాకలో 9 బస్తాలు పట్టుకున్న పోలీసులు

- పక్కదారి పడుతున్న పౌష్టికాహారం
- పట్టించుకోని ఐసీడీఎస్ అధికారులు



భువనగిరిటౌన్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలువురు పాడి రైతులు బాలామృతం కొనుగోలు చేసి గేదెలకు, ఆవులకు దాణాగా వినియోగిస్తున్నారు. చిన్నారులకు చేరాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతున్నా ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోవడం లేదు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని బహేర్‌పేటలో చీమల నరేష్ పాశువుల పాకలో 9 బస్తాల బాలామృతాన్ని మంగళవారం భువనగిరి పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తక్కువ ధరకు రావడంతోపాటు పశువులు పాలు సమృద్ధిగా ఇస్తుండడంతో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, మోత్కూర్‌కు చెందిన టీస ప్రశాంత్ వద్ద భువనగిరికి చెందిన చీమల నరేష్ బాలామృతం కొనుగోలు చేసి పశువులకు దాణాగా వేస్తున్నాడు. కాగా పోలీసులు నరేష్‌ను పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సురేష్‌కుమార్ తెలిపారు.

బస్తాకు రూ.200 చొప్పున విక్రయం

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులకు ఎంతో కొంత నగదు ఇచ్చి బాలామృతం ప్యాకెట్లను పలువురు కొంటున్నారని సమాచారం. జిల్లావ్యాప్తంగా ఇలా చిన్నారులకు అందాల్సిన బాలామృతం పక్కదారి పడుతుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. బాలామృతం ప్యాకెట్లు చెత్తకుప్పల్లో కనిపిస్తున్నా.. పశువులకు దాణాగా వినియోగిస్తున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. భువనగిరి పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక బస్తా రూ.200 చొప్పున అమ్ముతున్నారని సమాచారం. కాగా ఒక బస్తాలో 8 బాలామృతం ప్యాకెట్లు.. ఒక్కొక్క ప్యాకెట్‌లో 2 కిలోల చొప్పున పౌష్టికాహారం ఉంటుంది.

పర్యవేక్షణ లేకనే..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకున్న చాలామంది లబ్ధిదారులు కేంద్రాలకు వెళ్లి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని తీసుకోవడం లేదు. దీంతో కేంద్రాలకు వచ్చే కోడిగుడ్లు, బాలామృతం, పాలు తదితర పౌష్టికాహార సరుకులు పక్కదారి పడుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని భువనగిరి, ఆలేరు, రామన్నపేట, మోత్కూర్ ప్రాజెక్టుల పరిధిలో 901 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. వీటి పర్యవేక్షణకు సూపర్‌వైజర్లు, సీడీపీఓలతోపాటు జిల్లా సంక్షేమ అధికారి ఉంటారు. ఎక్కువగా సూపర్‌వైజర్లే తమ పరిధిలోని అంగనవాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే పౌష్టికాహారం, ప్రీ స్కూల్ విద్య, రోజువారీ హాజరు, తదితర అంశాలను పర్యవేక్షిస్తుంటారు. అయినా పౌష్టికాహారం పక్కదారి పడుతోందంటే కారణమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తుండగా.. మరికొందరు మాత్రం సంబంధిత అధికారులకు తొత్తులుగా మారి తమను ఎవ్వరూ ఏమీ చేయలేరనే ధీమాతో స్వయంగా తమ పరిధిలోని కేంద్రాల నుంచి సరుకులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కదారి పడుతున్న పౌష్టికాహారంపై దృష్టి పెట్టాలని, బాలామృతం పశువులపాలు కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లాలోని పలువురు కోరుతున్నారు.

కిలోన్నర గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

సూర్యాపేట టౌన్ : గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిని పట్టుకుని కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రవి తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఈ నెల 9న పట్టణ సీఐ వీరరాఘవులు ఆదేశాల మేరకు ఎస్ఐ ఏడుకొండలు తన సిబ్బందితో కలిసి సూర్యాపేట పట్టణంలోని భీమారం రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకుని విచారించారు. సూర్యాపేట మండలం తాళ్లఖమ్మంపహాడ్‌లో నివాసముంటున్న నిడిగంటి హరికృష్ణ అనే వ్యక్తిగా గుర్తించారు. అతడి వద్ద ఉన్న బైక్‌లోనుంచి కిలోన్నర గంజాయిని సీజ్ చేసి హరికృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విచారణలో నిందితుడు పలు విషయాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణానికి చెందిన పాలబిందెల సిద్దు, అనోజ్, హరికృష్ణ స్నేహితులు. వీరికి హైదరాబాద్‌కు చెందిన శివ, ఆనంద్ స్నేహితులు. వీరంతా కలిసి అప్పుడప్పుడు బైక్‌లపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం దగ్గర గల సీలేరు ప్రాంతానికి వెళ్లి గంజాయి కొనుగోలు చేసి, కొంత గంజాయి తాగి, మరికొంత అమ్మేవారు. ఈ నెల 4న వీరంతా కలిసి 10 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. హరికృష్ణ వద్ద కిలోన్నర గంజాయి దొరికిందని, మిగతా గంజాయిని, నిందితులను కూడా పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భూవివాదంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

తిప్పర్తి : భూ తగాదాలతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మామిడాల గ్రామానికి చెందిన గజ్జి శంకర్ అతడి బాబాయ్ గజ్జి లింగయ్య మధ్య కొంతకాలంగా భూ వివాదాలు జరుగుతున్నాయి. మంగళవారం గజ్జి శంకర్, అతడి సోదరులు గజ్జి సైదులు, రామలింగం, శంకర్ భార్య లక్ష్మికాంత, వదిన విజయలక్ష్మి, తల్లి సత్తమ్మలు పొలం పనులు చేస్తున్నారు. ఈక్రమంలో గజ్జి లింగయ్య, అతడి కుమారులు గణేష్, శంకర్, సందీప్, పద్మలు కర్రలు, గొడ్డళ్లు, రాళ్లు, కారం పొడితో వచ్చి గజ్జి శంకర్ కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఈ ఘటనలో గజ్జి సత్తమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి, వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. గజ్జి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐసాయి ప్రశాంత్ తెలిపారు.

చోరీకి గురైన ఆటోలు స్వాధీనం



ఆటోలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆలేరు రూరల్ : దొంగతనానికి గురైన ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆలేరు పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రజనీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న మూడు ఆటోలను గత మంగళవారం రాత్రి గుర్తు తెలియన వ్యక్తులు దొంగిలించారు. దీంతో సాయిగూడెం గ్రామానికి చెందిన బాధితుడు మద్దెపాక నరేష్ ఆలేరు పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేశాడు. మంగళవారం పోలీసులు బైపాస్ రోడ్డులోని ఛత్రపతి దాబా సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ముగ్గురు బాల నేరస్తులు అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో తాము దొంగలించిన మూడు ఆటోలను కోదాడ పట్టణంలో వీరబాబు అనే వ్యక్తికి విక్రయించామని తెలిపారు. ఆటోలను స్వాధీనం చేసుకుని వీరబాబును, బాల నేరస్తులను కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ రజనీకర్ తెలిపారు. కేసును చేధించిన సీఐ కొండల్‌రావు, ఎస్ఐ రజనీకర్, కానిస్టేబుల్ చంద్రశేఖర్, మహేష్‌లను ఏసీపీ రమేష్ అభినందించారు.

ఆటో చోరీ

భువనగిరి : ఆటో చోరీకి గురైన సంఘటన భువనగిరి మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దంతూరి భాస్కర్ ఈ నెల 9వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో ఆటోను తన ఇంటి ఎదుట ఉంచి తాళం వేసి పడుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో నిద్ర లేచి చూసేసరికి ఆటో కనిపించలేదు. దీంతో స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

చౌటుప్పల్ : ఇంటి ఎదుట నిల్చున్న మహిళ మెడలోనుంచి గుర్తు తెలియన దుండగులు బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హనుమాన్‌నగర్ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన గుర్రం భార్గవి తన ఇంటి ఎదుట నిల్చున్న సమయంలో పల్సర్ బైక్‌పై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వచ్చారు. తమ సెల్‌ఫోన్‌లో ఒక వ్యక్తి ఫొటోను చూపించి అతడిని ఎక్కడైనా చూశారా అని అడిగారు. తాను చూడలేదని మహిళ సమాధానం చెప్పింది. అనంతరం తన పనిలో నిమగ్నమవుతున్న క్రమంలో బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి మహిళ మెడలో ఉన్న రెండున్నర తులాల విలువైన బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. తేరుకున్న మహిళ సదరు దుండగులను పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ తప్పించుకుని పోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

చిట్యాల: పట్టణంలో ఈ నెల 4వ తేదీన ఓ ఇంట్లోకి దూరి మహిళ మెడలో బంగారు పుస్తెల తాడు లాక్కెళ్లిన ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండ్‌కు పంపించినట్లు నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ ఎన్.ధర్మా మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని వనిపాకల గ్రామానికి చెందిన మేడి సంతోష్‌కుమార్, బర్రె శ్రీను విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనం చేయాలనుకున్నారు. ఈ నెల 4వ తేదీన చిట్యాల పట్టణంలోని చేపూరి సత్తిరెడ్డి ఇంట్లో ఆయన భార్య ప్రేమలత ఒంటరిగా ఉండగా పెప్పర్ స్ప్రేతో వీరిద్దరు కలిసి దాడి చేశారు. అనంతరం ఆమె ముఖంపై దాడి చేసి గాయపరిచి ఆమె ఒంటిపై గల ఐదు తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని పరారయ్యారు. బాధితురాలు చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో అదేరోజు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన సంతోష్‌కుమార్, శ్రీనును చిట్యాలలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి వద్ద మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి ఐదు తులాల బంగారు పుస్తెల తాడుతోపాటుగా రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

పశు ఔషధ బ్యాంకుకు మందులు విరాళం

కోదాడ రూరల్ : కోదాడ పట్టణంలోని పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఔషధ బ్యాంకుకు నియోస్పార్క్ వెటర్నరీ మందుల కంపెనీకి చెందిన ప్రతినిధులు రూ.26,733 విలువ చేసే మందులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం కోదాడ ప్రాంతీయ పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య మాట్లాడుతూ కోదాడ ప్రాంతీయ పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన పశు ఔషధ బ్యాంకుకు మందులను విరాళంగా ఇచ్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పశుపోషకులు మందుల కొనుగోలుకు ఇబ్బంది పడకుండా ఈ ఔషధ బ్యాంకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాతలు మరికొందరు ముందుకు వస్తే కోదాడ ప్రాంతంలోని మూగజీవాలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ దక్షిణ తెలంగాణ ఏరియా మేనేజర్ చల్లా వెంకటేష్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది చంద్రకళ, పాడి రైతులు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం



లోకేష్‌రెడ్డి

హుజూర్‌నగర్ : విద్యార్థి తప్పిపోయిన సంఘటన హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. హుజూర్‌నగర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి సైదిరెడ్డి కొడుకు లోకేష్‌రెడ్డి స్థానిక ప్రైవేటు స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. లోకేష్‌రెడ్డి సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటి వచ్చే క్రమంలో పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో బస్సు ఎక్కి ఎటో వెళ్లిపోయాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సైదిరెడ్డి తెలిపారు. తన కొడుకు సమాచారం తెలిస్తే 9676546388, 9963776388, 98485 81888 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

జారిపడి చిన్నారి మృతి



హన్సిక

చింతపల్లి: ప్రమాదవశాత్తు ఇంట్లో జారిపడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన మంగళవారం చింతపల్లి మండల పరిధిలోని కుర్మపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుర్మపల్లి గ్రామానికి చెందిన ఉడుగుంట్ల విఠల్–శిరీష దంపతుల రెండో కుమార్తె హన్సిక (3) కురుమేడు గ్రామంలోని నలంద పాఠశాలలో నర్సరీ చదువుతోంది. రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఇంట్లో కాలు జారి మెట్ల మీద పడడంతో తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం మాల్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

స్వర్ణగిరి శ్రీవారిని దర్శించుకున్న వీహెచ్

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు దర్శించుకున్నారు. ఆలయంలో వీహెచ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ధర్మకర్త మురళి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ సమాచారం

దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎంజీయూ రిజిస్ట్రార్ రవి

నల్లగొండ రూరల్ : దేశ ప్రగతిలో పౌరులందరూ భాగస్వాములు కావాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. మంగళవారం ఎంజీయూలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులతోపాటు ప్రతి పౌరుడు విధులను తెలుసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయం విడిచి వెళ్లిన తర్వాత అనేక విచిత్రమైన అనుభవాలు సమాజం నేర్పిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎంబీఏ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు శేఖర్, ఆనంద్, స్వప్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్ : బీఈడీ సెమిస్టర్–2 రెగ్యులర్, బ్యాక్‌లాగ్–2024 ఫలితాలను మంగళవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి విడుదల చేశారు. 2590 మంది విద్యార్థులకు గాను 1813 మంది పాస్ అయ్యారని, 692 మంది విద్యార్థులు ప్రమోట్ కాగా 85 మంది డిటెండ్ అయినట్లు ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

ఖోఖో పోటీలకు ఎంజీయూ జట్ల ఎంపిక



ఖోఖో పోటీలకు ఎంపికైన పురుషుల జట్టు

నల్లగొండ రూరల్ : అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో పోటీలకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఖోఖో జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఈ నెల 27 నుంచి 31 వరకు తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం వేదికగా జరుగనున్న పోటీలకు మహిళల, పురుషుల జట్లు పాల్గొంటాయని ఎంజీయూ క్రీడల కార్యదర్శి హరీష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా అధికారులు రమావత్ మురళి, శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఖోఖో పోటీలకు ఎంపికైన మహిళా క్రీడాకారులు

ఘనంగా సాగర్ ప్రాజెక్టు శంకుస్థాపన దినోత్సవం



శంకుస్థాపన పైలాన్ పిల్లర్ వద్ద ఇంజనీర్లు

నాగార్జునసాగర్: ఆధునిక దేవాలయం అనే పేరు సార్థకం చేసుకున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టులో విధులు నిర్వహించడం ఆనందంగా ఉందని డ్యామ్ ఎస్ఈ శ్రీధర్‌రావు అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు పునాది రాయి వేసి 69 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం 70వ శంకుస్థాపన దినోత్సవాన్ని ప్రాజెక్టు ఇంజనీర్లు ఘనంగా నిర్వహించారు. ఆనాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేసిన పైలాన్ పిల్లర్‌ను రంగురంగుల పూలతో అలంకరించి పూజలు చేశారు. సాగర్ డ్యామ్ నిర్మాణ సమయంలో చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన మీర్ జాఫర్ అలీ విగ్రహానికి, సాగర్ డ్యామ్ నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు అమరులైన కార్మికుల స్మారకార్థం నిర్మించిన స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డ్యామ్ ఎస్ఈ శ్రీధర్‌రావు మాట్లాడుతూ ఈ ఏడాది జలాశయం పూర్తిస్థాయిలో నిండి నేటికీ గరిష్ట స్థాయిలో నీరు ఉండడం సంతోషదాయకమన్నారు. కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలకు ఆరుమార్లు డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు 940 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏఈలు నర్సింహమూర్తి, కృష్ణయ్య, సత్యనారాయణ, ఎస్పీఎఫ్ ఆర్ఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ రఘుబాబు, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు ఎంపిక



రిత్విక్



ఈశ్వర్

కోదాడరూరల్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా జరిగే అండర్–14 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా టీమ్‌కు కోదాడకు చెందిన కోదాడ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు రిత్విక్, ఈశ్వర్ ఎంపికైనట్లు కోచ్ సిద్ధిఖ్ మంగళవారం తెలిపారు. ఇటీవల నల్లగొండలో జరిగిన క్రికెట్ పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని అన్నారు. రిత్విక్ కోదాడ పట్టణంలోని జయ పాఠశాలలో 9వ తరగతి, ఈశ్వర్ హోలీ ఫ్యామిలీ పాఠశాలో 8వ తరగతి చదువుతూ ఎనిమిది నెలలుగా తమ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నట్లు కోచ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ సలీంషరీఫ్, అకాడమీ ప్రెసిడెంట్ కొత్తపల్లి సురేష్ అభినందించారు.

జెండాలే అండగా..



కొంగల బారినుంచి రక్షణ కోసం ఓ రైతు నారుమడి చుట్టూ జెండాలు ఏర్పాటు చేశాడు. ఈ దృశ్యం భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పురం సమీపంలో కనిపించింది. గాలికి రంగురంగుల జెండాలు కదులుతుండడంతో కొంగలు నారుమడిపై వాలకుండా ఉంటాయని రైతు చెబుతున్నాడు. – భూదాన్‌పోచంపల్లి

వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులు

- రైతులకు నడిగూడెం ఏఓ రాయపు దేవప్రసాద్ సూచనలు





వరి నారుమడి

నడిగూడెం : వానాకాలం సీజన్ వరి కోతలు ఓవైపు పూర్తి కావొస్తున్నాయి మరోవైపు నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు రైతులు, బోర్లు, బావులు, చెరువుల కింద రైతులు యాసంగి వరి నారుమడి పెంపకంలో బిజీగా ఉన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో చలి తీవ్రత బాగా ఉంటుందని, నారుమడి యాజమాన్యంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్ చెబుతున్నారు. వరి నారుమడిలో యాజమాన్య పద్ధతులపై సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

చలి సమస్యను అధిగమించడానికి..

యాసంగిలో దమ్ము చేసే నారుమడిలో కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండాజిమ్‌ను తడితో పట్టించి, ఆరబెట్టి విత్తనాలను నారుమడిలో చల్లుకోవాలి. రాత్రి ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్ కంటె తగ్గినప్పుడు, చలి తీవ్రత పెరిగి సరిగా నారు ఎదగక ఎర్రబడి, కొన్నిసార్లు చనిపోతుంది. రెండు గుంటల నారుమడికి రెండు కిలోల నత్రజని (ఒక కిలో విత్తనం చల్లేముందు, మరో కిలో 12–14 రోజులకు) ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాషం ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడ లేదా రెండు క్వింటాళ్లు మాగిన కోళ్ల ఎరువు లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీ కంపోస్టు వేసి కలియదున్నాలి. చలి సమస్యను అధిగమించడానికి.. నారుమళ్లపైన ఇనుప చువ్వలు లేదా వెదురు కర్రలతో ఊతం ఇచ్చి, పైన పలుచని పాలిథిన్ షీట్ లేదా పాలీప్రొవెన్ యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలతో సాయంత్రం వేళల్లో కప్పి ఉంచాయి. మరుసటి రోజు ఉదయాన్నే వాటిని తీసివేయాలి. యాసంగిలో జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనపడతాయి. కాబట్టి జింకు లోపాన్ని సవరించాలి. జింకు సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు ఆరోగ్యంగా పెరగడానికి పైపాటుగా యూరియాకి 2 గ్రాముల కార్బండాజిమ్, మాంకోజెబ్ మిశ్రమ మందును కలిపి వేసుకోవాలి. రాత్రి వేళల్లో నీరు నిండుగా ఉంచి తెల్లవారుజామున తీసివేసి కొత్త నీరు పెట్టాలి.